సొంత భవనాలు లేక అవస్థలు

- అద్దె భవనాల్లోనే ప్రభుత్వ కార్యాలయాలు
- ప్రజలకు తప్పని తిప్పలు


వాల్మీకి భవనంలో పోలీసు స్టేషన్


గ్రామ పంచాయతీ భవనంలో కొనసాగుతున్న తహసీల్దార్ కార్యాలయం

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలకు పక్కా భవనాలు లేకపోవడంతో ఆయా గ్రామాల నుంచి పనుల నిమిత్తం వచ్చే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల కేంద్రంలో ఏర్పడి పదేళ్లైనా ఇప్పటికి సొంత భవనాలు నిర్మించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడంతో గ్రామీణులకు తిప్పలు తప్పడం లేదు. అద్దె భవనాలలోనే పలు కార్యాలయాలలో కార్యకలాపాలు నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది.కనీస వసతులు లేక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. పాలకులు హామీలకే పరిమితం అవుతున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.

అద్దె భవనాలలో పలు కార్యాలయాలు

మండలంలోని తహసీల్దార్ కార్యాలయం, పోలీసు స్టేషన్, మహిళా సమైక్య భవనం, వ్యవసాయ కార్యాలయం, సహకార సంఘ కార్యాలయం, ఎంపీపీ భవనం వంటి కార్యాలయాలు అద్దె భవనాలలోనే కొనసాగుతున్నాయి. తహసీల్దార్ కార్యాలయం గ్రామపంచాయతీ భవనంలో, పోలీసు స్టేషన్ వాల్మీకీ కమిటీ హాల్, వ్యవసాయ కార్యాలయం వడ్డెర సంఘం కమిటీ హాల్, మహిళా సమైక్య భవనం వంటి అద్దె భవనాలలో ప్రభుత్వ కార్యాలయాల కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు.

అధికారులు పట్టించుకోవడం లేదు



నూతనంగా మండలం ఏర్పడి పదేళ్లు అయినా పక్కా భవనాలు ఏర్పాటు చేయలేదు. పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదు. సొంత భవనాలు నిర్మించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలి. ప్రభుత్వం చొరవ తీసుకొని నిధులు కేటాయించాలి.

– అబ్దుల్‌రఫీ, పెంట్లవెల్లి

స్థల పరిశీలన చేపట్టాం

ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించేందుకు కొన్ని రోజుల కిందట సర్వే చేపట్టాం. ప్రభుత్వ స్థలాన్ని గుర్తించాం. జిల్లా ఉన్నతాధికారులకు నివేదికలు పంపించాం. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం. కార్యాలయ పనులు ఆలస్యంగా కాకుండా చర్యలు తీసుకుంటున్నా. అధికారులకు ప్రజలు సహకరించాలి.

– విజయసింహ, తహసీల్దార్

నేడు విద్యాసంస్థల బంద్


అచ్చంపేటలో విద్యార్థులతో మాట్లాడుతున్న విద్యార్థి సంఘం నాయకులు

కందనూలు: స్కాలర్‌షిప్, ఫీరీయింబర్స్‌మెంట్ బకాయిలు ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో దీనికి నిరసనగా బుధవారం విద్యా సంస్థల బంద్ పాటిస్తున్నట్లు ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి తారాసింగ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెండింగ్‌లో ఉన్న రూ.8,000 కోట్లను విడుదల చేయాలని కోరారు. బంద్‌కు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

విద్యాశాఖ మంత్రిని నియమించాలి

తెలకపల్లి: విద్యా సంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రేమ్‌కుమార్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు దేశమోని ఆంజనేయులు అన్నారు. మంగళవారం మంగళవారం వామపక్ష విద్యార్థి సంఘం సమావేశం నిర్వహించారు. విద్యాశాఖ మంత్రిని నియమించాలన్నారు. అంబేడ్కర్ చౌరస్తా వద్ద బంద్‌పోస్టర్ ఆవిష్కరించారు. నాయకులు మదుగౌడ్, శివప్రసాద్, లక్ష్మణ్, వామపక్ష నాయకులు పాల్గొన్నారు.

అచ్చంపేటలో..

అచ్చంపేట రూరల్: వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు సయ్యద్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రేమ్ కుమార్ కోరారు. పట్టణంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు, పాఠశాలల వద్దకు వెళ్లి బంద్‌కు సహకరించాలని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలను, విద్యార్థులను కోరారు. నాయకులు నరేష్, విజయ్, సాయి, విద్యార్థులు పాల్గొన్నారు.

పంటను పరిశీలించిన అధికారులు


మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

బిజినేపల్లి: మండలంలోని వట్టెం గ్రామానికి చెందిన శ్రీను, బీమయ్యలు సాగుచేసిన మొక్కజొన్న పంట ఎండిపోయింది. కొన్నిరోజుల కిందట మందులను పిచికారీ చేయడంతో పంట ఎండిందని రైతులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు మంగళవారం రైతులు సాగుచేసిన మొక్కజొన్న పంటను ఏడీఏ పూర్ణ చంద్రారెడ్డి, ఏవో కమల్‌కుమార్‌లు పరిశీలించారు. కొన్ని మొక్కలను సేకరించి వాటిని వ్యవసాయ శాస్త్రవేత్తల పరీక్షల నిమిత్తం పంపిస్తామన్నారు. అనంతరం వట్టెం గ్రామానికి చెందిన జయశ్రీ ట్రేడర్స్‌లో పిచికారీ మందులకు సంబంధించిన నిల్వలపై స్టాప్ సేల్ ఆర్డర్ ఇచ్చినట్లు ఏఓ కమల్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఏఈఓ భార్గవ్, రైతులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ పార్టీ ప్రజల విశ్వాసం కోల్పోయింది'


మాట్లాడుతున్న ఆచారి

కల్వకుర్తి రూరల్: ఆరు గ్యారంటీలు అమలుకాకపోవడంతో కాంగ్రెస్ పార్టీ ప్రజల విశ్వాసం కోల్పోయిందని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి అన్నారు. మంగళవారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో మండల కార్యశాల కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. స్థానిక సంస్థల ఎన్నికలపై కార్యకర్తలతో చర్చించారు. అనంతరం ఆచారి మాట్లాడుతూ బీజేపీపై ప్రజలకు నమ్మకం పెరిగిందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గన్నోజు బాబీదేవ్, దుర్గాప్రసాద్, రాఘవేంద్ర గౌడ్, వివేకానంద, శేఖర్ రెడ్డి, శ్యామ్, రాం భూపాల్ రెడ్డి, నరసింహ, నర్సిరెడ్డి, కిష్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలి


హాజరైన వాల్మీకి బోయలు

కొల్లాపూర్: వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని వాల్మీకిబోయ హక్కుల పోరాట సమితి నాయకులు పురుషోత్తం నాయుడు, ప్రసాద్‌నాయుడులు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో ఆ సంఘం నాయకులు సమావేశం అయ్యారు. గత ప్రభుత్వం బోయలను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు చెల్లప్ప కమిషన్ ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. కమిషన్ నివేదిక ఇచ్చినా ఎస్టీ జాబితాలో చేర్చకపోవడం సరికాదన్నారు. ఇటీవల జటప్రోల్‌లో జరిగిన కాంగ్రెస్ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వాల్మీకి బోయల సమస్యను ప్రస్తావించడం మంచి పరిణామమన్నారు. ఎస్టీ జాబితాలో చేర్చేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ నెల 29న కొల్లాపూర్‌లో నియోజకవర్గ నూతన కమిటీని ఎన్నుకోనున్నట్లు వారు తెలిపారు. కమిటీ ఎన్నికకు వాల్మీకి బోయలు హాజరుకావాలని కోరారు. సమావేశంలో నాయకులు పురుషోత్తం నాయుడు, ప్రసాద్‌నాయుడు, వెంకటేష్‌నాయుడు, మల్లయ్య, సీపీ నాయుడు, సురేష్ తదితరులు ఉన్నారు.

భూ నిర్వాసితులకు పరిహారం ఇవ్వాలి


అడిషనల్ కలెక్టర్ అమరేందర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, బాధిత రైతులు

నాగర్‌కర్నూల్ రూరల్: పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా రిజర్వాయర్ నిర్మాణంలో భూములు కోల్పోయారని తీగలపల్లికి చెందిన రైతులకు తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నరసింహ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూములు కోల్పోయి 10 సంవత్సరాలుగా కావొస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధిత రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యిందన్నారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం బాధిత రైతులకు భూములు కోల్పోయిన వారిని నష్ట పరిహారం చెల్లించిన తర్వాతనే పనులు చేపట్టాల్సి ఉండగా భూములను లాక్కొని రిజర్వాయర్ నిర్మాణం పనులు చేపట్టడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి భూములు కోల్పోయిన రైతులను గుర్తించి తక్షణమే నష్టపరిహారం డబ్బులు చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం బాధిత కుటుంబాలతో కలిసి అదనపు కలెక్టర్ అమరేందర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సుభాష్ తోపాటు బాధిత రైతులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడి


సిర్సనగండ్లలో పత్తి పంటను పరిశీలిస్తున్న ఏఈఓ వంశీ

చారకొండ: సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడి సాధ్యమని ఏఈఓ వంశీ అన్నారు. మండలంలోని సిర్సనగండ్లలో మంగళవారం రైతులు సాగుచేసిన పత్తి పంటలను క్షేత్రస్థాయిలో ఆయన పరిశీలించారు. పంట పొలంలో కలుపు నివారణ చర్యలు తీసుకోవాలని రైతులకు సూచించారు. పత్తి పంటలో కలుపు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వ్యవసాయ అధికారులు సలహాలు, సూచనలు పాటించాలని కోరారు.

జర్నలిస్టులకు టోల్‌టాక్స్ మినహాయింపు ఇవ్వాలి

కందనూలు: మన్ననూరు, దోమలపెంట ప్రధాన చెక్‌పోస్టులతో పాటు అటవీ ప్రాంతంలో ఉన్న దర్శనీయ స్థలాల వద్ద ఏర్పాటుచేసిన ఫారెస్ట్ చెక్ పోస్ట్‌ల వద్ద నాగర్ కర్నూల్ జిల్లాతో పాటు ఉమ్మడి పాలమూరు జిల్లా జర్నలిస్టులకు టోల్‌టాక్స్ మినహాయింపు ఇవ్వాలని కోరుతూ టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్ బదావత్ సంతోష్, జిల్లా ఫారెస్ట్ అధికారి రోహిత్ గోపిడీలకు వినతిపత్రం అందజేశారు. దీనికి కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు ఆ సంఘం నాయకులు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు విజయకుమార్, కార్యదర్శి సురేష్ కుమార్, సహాయ కార్యదర్శి పి యాదయ్య, ఈసీ మెంబర్లు ప్రసాద్, రమణ కుమార్, కొల్లాపూర్ నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు రాజేందర్ గౌడ్, వెంకటస్వామి, నాగర్ కర్నూల్ ఉపాధ్యక్షుడు జంగిటి రాంప్రకాష్, పట్టణ అధ్యక్షుడు మల్లేష్‌తో పాటు సీనియర్ రిపోర్టర్లు కందికొండ మోహన్, మాధవరెడ్డి, వినయ్ కుమార్ , తెలకపల్లి మండల శాఖ అధ్యక్షుడు చింత కృష్ణయ్య పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని వినతి



వెల్దండ: మండలంలోని బైరాపూర్ వాగు నుంచి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని మంగళవారం మాజీ సర్పంచ్ దార్లకుమార్, మాజీ సర్పంచ్ రమేష్‌గౌడులు తహసీల్దార్ కార్తీక్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఇసుక అనుమతులు తీసుకొని రాత్రి వేళల్లో అక్రమంగా ఇతర ప్రాంతాలలో ఇసుక డంపులు చేస్తున్నారని వివరించారు. అనుమతులు లేని ట్రాక్టర్లతో డంపులు చేస్తున్నట్లు ఆరోపించారు. అధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



తెలకపల్లి: మండలంలోని అలేరు ప్రాథమిక పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు జె సౌజన్య, సంధ్యలు కల్వకుర్తి పట్టణంలో బాలుర ఉన్నత పాఠశాల ఆవరణంలో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ కనబర్చారు. అండర్ స్టాండింగ్ బ్రాండ్ జంప్ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాలయ్య తెలిపారు.

పెద్దకొత్తపల్లి: రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ జావెలింగ్‌త్రో పోటీలకు పెద్దకొత్తపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థి టీ.శేఖర్ ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసురెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయుడు బాలసుబ్రమణ్యం మంగళవారం తెలిపారు. ఇటీవల కల్వకుర్తిలో జరిగిన జిల్లా స్థాయి పోటీలల్లో ప్రథమ బహుమతి గెలుచుకున్న శేఖర్ రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాడు. ఆగస్టు 7వ తేదీన జరిగే జాతీయ జావెలింగ్‌త్రో పోటీల్లో విద్యార్థి పాల్గొంటారని వారు పేర్కొన్నారు.

పేద విద్యార్థికి సియా ఫౌండేషన్ చేయూత



కల్వకుర్తి రూరల్: పేదలకు సియా ఫౌండేషన్ ఎల్లప్పుడు చేయూతనిస్తుందని ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ సయ్యద్ అంజాద్ తెలిపారు. మంగళవారం పట్టణంలో పేద విద్యార్థి సమీరా విద్యాభివృద్ధి కోసం రూ.50 వేలు ఆర్థిక సాయం అందజేశారు. మాడుగుల గ్రామానికి చెందిన సమీరా ఇంటర్ విద్య కోసం ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతుండటంతో ఆర్థిక చేయూత నిచ్చినట్లు పేర్కొన్నారు. కల్వకుర్తి మండలం మార్చాల గ్రామానికి చెందిన ధనుష్ ఇంటర్మీడియట్ చదివేందుకు ఆర్థిక ఇబ్బందులు పడుతుండటంతో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ హైదరాబాద్‌లో రూ.10వేలు ఆర్థికసాయం చేశారు. మాజీ సర్పంచ్ ఆనంద్ కుమార్, శనవాజ్ ఖాన్, ఇంతియాజ్ ఖాన్, అయూబ్, శ్రీనివాస్ రెడ్డి, జాంగీర్, ఎజాస్, బీఆర్‌ఎస్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు నిజాముద్దీన్, నారాయణ పాల్గొన్నారు.

కేరళ మాజీ ముఖ్యమంత్రికి ఘన నివాళి


నాగర్‌కర్నూల్‌లో అచ్యుతానంద చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

నాగర్‌కర్నూల్ రూరల్/ఉప్పునుంతల/తాడూరు: సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు, కేరళ మాజీ సీఎం అచ్యుతానందన్ మృతికి పలు గ్రామాల్లో సీపీఎం నాయకులు మంగళవారం నివాళులర్పించారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఆయన సేవలను కొనియాడారు. అదేవిధంగా ఉప్పునుంతల మండల కేంద్రంలోని పోచమ్మ చౌరస్తాలో, తాడూరులో ఆ పార్టీ నాయకులు నివాళులర్పించారు. అచ్యుతానందన్ మృతి తీరనిలోటన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్ శ్రీనివాసులు జిల్లా కమిటీ సభ్యులు నరసింహ, పొదిల రామయ్య, మండల కమిటీ సభ్యుడు సురేష్, నాయకులు మధు సుభాష్, మల్లికార్జున్, లక్ష్మయ్య, మురళి, నరసింహ, సత్యం చారి కురుమూర్తి, వెంకటయ్య, కృష్ణయ్య, బాలయ్య, రాఘవేంద్ర చారి తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీ అమలులో ప్రభుత్వం విఫలం


మాట్లాడుతున్న జోగు ప్రదీప్

తిమ్మాజిపేట: ఆరు గ్యారంటీ అమలులో ప్రభుత్వం విఫలం అయ్యిందని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జోగు ప్రదీప్, మాజీ ఎంపీపీ రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎరువుల కోసం సహకార సంఘాల కార్యాలయాల వద్ద రైతులు పడిగాపులు కాస్తున్నారని విమర్శించారు. పాసు పుస్తకాలు, చెప్పులు క్యూలో పెట్టాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతామని హెచ్చరించారు. సమావేశంలో మాజీ సర్పంచులు గోపిగౌడ్, వెంకటేష్, స్వామి, హుస్సేన్,ప్రశాంత్, చిన్నయ్య, పాండు, ఇబ్రహీం, సలావుద్దీన్, సైఫ్ ఉన్నారు.

కాల్వ ఊట నీరుతో ఇబ్బందులు


నక్కలపల్లికి కేఎల్‌ఐ కాల్వ ద్వారా వస్తున్న ఊట నీరు

పెద్దకొత్తపల్లి: మండలంలోని నక్కలపల్లిలో కేఎల్‌ఐ పంట కాల్వ ద్వారా ఊట నీరు గ్రామంలోకి రావడంతో గ్రామ వీధులు బురదమయంగా మారి ప్రజలు నడవడానికి ఇబ్బందులు పడుతున్నారు. కేఎల్‌ఐ కాల్వల నీరు బయటకి వెళ్లకుండా సిమెంట్ సీసీ లైనింగ్ పనులు చేపట్టకపోవడంతో ఊట నీరంతా గ్రామంలోకి వస్తోందని గ్రామస్తులు వాపోయారు. పదేళ్ల నుంచి ఊట నీరు రాకుండా డీ–6 సబ్ కెనాల్‌కు ఇరువైపులా లైనింగ్ పనులు చేపట్టాలని కేఎల్‌ఐ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించిన పట్టించుకోవడంలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్ల మధ్యన ఊట నీరు నిల్వ ఉండి ఈగలు, దోమలబెడద ఎక్కువై ప్రజలు రోగాలబారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఊట నీరు రాకుండా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం


ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

వంగూరు: పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. మంగళవారం రంగాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులు, కోనాపూర్‌లో సీసీ రోడ్లు, వంగూరు సమీపంలో బ్రిడ్జిని ఎమ్మెల్యే ప్రారంభించారు. అదేవిధంగా మిట్టసదగోడులో రేషన్‌కార్డుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి నిరంతరం ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతున్నారన్నారు. నాయకులు అల్వాల్‌రెడ్డి, రమేష్‌గౌడ్, క్యామ మల్లయ్య, విష్ణువర్ధన్‌రెడ్డి, పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

వివాదాస్పద రోడ్డు పరిశీలన

ఉప్పునుంతల: మండలంలోని వెల్టూరు నుంచి విష్ణుపూర్ (చాకలిగుడిసెలు) రోడ్డు కొంత ఆక్రమణకు గురై వివాదాస్పదం కావడంతో మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ రోడ్డును పరిశీలించారు. స్థానికులు, రెవెన్యూ అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ప్రస్తుతం 30 ఏళ్ల నుంచి పొలాల నుంచే రోడ్డును కొనసాగించాలని ఎమ్మెల్యే సూచించారు. ఎమ్మెల్యేతోపాటు పీఆర్ డీఈఈ చంద్రకళ, ఏఈ, మణిపాల్, తహసీల్దార్ ప్రమీల, కాంగ్రెస్ మండలపార్టీ అధ్యక్షులు కట్టా అనంతరెడ్డి, వెంకట్‌రెడ్డి, గ్రామస్థులు ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

మన్ననూర్: అమ్రాబాద్ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ సమక్షంలో మంగళవారం అచ్చంపేటలో చేరారు. పార్టీ కండువా కప్పి ఎమ్మెల్యే ఆహ్వానించారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి కాంగ్రెస్‌లో చేరినట్లు బాల్ చంద్రయ్య, రమేష్, రాత్లావత్ రవి, గంటల రవి పేర్కొన్నారు. ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు సంతోష్, లక్ష్మణ్, కిన్నెర పాండు, లడ్డు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రికి నిరంతర విద్యుత్

అచ్చంపేట రూరల్: పట్టణంలోని ప్రాంతీయ ఆస్పత్రికి నిరంతరం విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకున్నామని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. మంగళవారం ప్రాంతీయ ఆస్పత్రిలో డెడికేటెడ్ 11కేవీ విద్యుత్ లైన్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. పట్టణంలో దుర్గాభవాని ఆరెకటిక మహిళా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఆరెకటికలను అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు. ఇన్‌చార్జ్ ఏడీఈ ఆంజనేయులు, అధికారులు, వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

31న ఉచిత కంటి వైద్య శిబిరం

నాగర్‌కర్నూల్ క్రైం: ఈ నెల 31న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా అంధత్వ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు ఉచిత కంటి చికిత్స శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆప్తాలమిక్ అధికారి కొట్ర బాలాజీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ భవనంలోని గది నంబర్ 102లో శిబిరం ఏర్పాటు చేస్తునట్లు పేర్కొన్నారు. క్యాటరాక్టు పొర గల వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు మహబూబ్ నగర్ ఏనుగొండ లయన్ రాంరెడ్డి కంటి ఆస్పత్రిలో నిర్వహిస్తునట్లు వివరించారు. కంటి శిబిరానికి వచ్చే వారు ఆధార్, రేషన్, ఓటరు కార్డు గుర్తింపు కార్డు తీసుకురావాలని కోరారు.

విద్యార్థులకు దుస్తుల పంపిణీ



అచ్చంపేట రూరల్: మండలంలోని పల్కపల్లి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు ఉపాధ్యాయురాలు సాయిజ్యోతి సొంత డబ్బులతో దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం ప్రమీల మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవాభావం కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తిర్పతయ్యగౌడ్, కల్పన, శేఖర్, జగన్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



కల్వకుర్తి రూరల్: మండలంలోని తాండ్ర ఎస్సీ, బీసీ కాలనీలలో నెలకొన్న డ్రెయినేజీ సమస్యతో పాటు సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాలని బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి సాయిలీలకు వినతిపత్రం మంగళవారం అందజేశారు. గ్రామంలో వీధుల్లో ఏర్పడిన గుంతలు పూడ్చాలని, పిచ్చి మొక్కలు తొలగించాలని, దోమల సమస్య అధికంగా ఉందని వివరించారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆంజనేయులు, మల్లేష్, పరమేష్, ప్రసాద్, శేఖర్, అంజి, వెంకట్, చంటి, శివ తదితరులు పాల్గొన్నారు.

సీడీపీఓపై చర్యలు తీసుకోవాలి



కల్వకుర్తి రూరల్: అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న సీడీపీఓ భాగ్యమ్మపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు ఆధ్వర్యంలో ఆర్డీఓ శ్రీను నాయక్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. అంగన్‌వాడీ టీచర్స్ నుంచి లంచాలు తీసుకుంటున్నారని ఆరోపించారు. తనిఖీల పేరుతో టీచర్లను నుంచి డబ్బులు వసూతు చేస్తోందన్నారు. అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మాసమ్మ, జయమ్మ, కాశన్న తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దాశరథి కృష్ణమాచార్య జయంతి

కోడేరు: మండలంలోని రాజాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం డాక్టర్ దాశరథి కృష్ణమాచార్య జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు ప్రభాకర్ మాట్లాడుతూ 'నా తెలంగాణ కోటి రతనాల వీణ' అని చాటిచెప్పిన దాశరథి అని కొనియాడారు. నిజాం సర్కారును ప్రశ్నించిన ధీరుడు అని అన్నారు. అనంతరం ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆంజనేయులు, గట్టయ్య, మల్లికార్జున్, సునీత, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటించాలి



వెల్దండ: వన మహోత్సవంలో భాగంగా అన్ని గ్రామాల్లో మొక్కలు నాటించాలని కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లకు ఏపీఓ ఈశ్వర్‌జీ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని ఎంజీతండా, ఉబ్బలగట్టుతండాలో ఏపీఓ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయ ఆవరణంలో ప్రభుత్వ స్థలాల్లో మొక్కలు నాటే విధంగా ఉపాధి హామీ కూలీలతో గుంతలను తవ్వించాలన్నారు. నర్సరీల్లో మొక్కలు అందుబాటులో ఉన్నాయన్నారు. నాటిన ప్రతి మొక్కను రక్షించాలన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, కార్యదర్శులు, తదితరులు ఉన్నారు.